క్లుప్తంగా

బహిరంగ సభను విజయవంతం చేయాలి



వెంకటాపురం(కె): ఈ నెల 17న తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే విజయభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టబోయే గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంపై చర్చించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చిడెం మోహనరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, నాయకులు రమేష్, చిడెం శివ, సునీల్, జల్లిగంపల కళాధర్, ఎంపీటీసీలు కొండపర్తి సీతదేవి, రవి, సురేంద్ర, చిట్టెం సాయి, తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌పై కేసు వెనక్కి తీసుకోవాలి



వెంకటాపురం(కె) : మండలంలోని బర్లగూడెం సర్పంచ్‌పై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని చిరుతపల్లి జీపీఎస్ విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. శుక్రవారం చిరుతపల్లిలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో గత 7 నెలలుగా ఒకే ఉపాధ్యాయురాలిచే విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని అన్నారు. 51 మంది విద్యార్థులకే ఒకే ఉపాధ్యాయురాలు ఎలా బోధిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎన్నిసార్లు ఐటీడీఏ విద్యాశాఖ అధికారి, పీఓ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని అన్నారు. చివరకు ఏటూరునాగారం ఐటీడీఏ ఎదుట ధర్నా చేశామన్నారు. తమ పిల్లల చదువుకోసం, మా కోసం అండగా నిలబడ్డ సర్పంచ్‌పై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయాలని అధికారులు చూస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు సర్పంచ్‌పై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని కోరారు.

అంకిత భావంతో పనిచేయాలి



కన్నాయిగూడెం: ఏజెన్సీలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, అధికారులు విధులపై అంకిత భావంతో పని చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం వైద్యశాలలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో సిబ్బంది హాజరు పట్టికను, రికార్డులను తనిఖీ చేశారు. వైద్యశాలకు రోజుకు ఎన్ని ఫీవర్ కేసులు వస్తున్నది సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బుట్టాయిగూడెంలో దోమల మందు స్ప్రెయింగ్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట సర్పంచ్ చిన్ని కృష్ణ పద్మ, వైద్య సిబ్బంది నర్సింహారావు, లక్ష్మయ్య, భాస్కర్, నగేష్, మంజు తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



ఎస్ఎస్ తాడ్వాయి : బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి చందులాల్ తనయుడు అజ్మీరా ప్రహ్లాద్ సమక్షంలో మండలంలోని బయ్యక్కపేటకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పత్తి గోపాల్‌రెడ్డి, మల్లేష్, నీరేటి వెంకన్న, బత్తిని రమేష్‌తో పాటు పలువురు నాయకులు శుక్రవారం బీజేపీలో చేరగా వారికి భాస్కర్‌రెడ్డి పార్టీ కండువా ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మల్లెల రాంబాబు, నాయకులు జయపాల్‌రెడ్డి, సుభాష్, భూక్య శ్రీనివాస్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

20న స్పాట్ అడ్మిషన్లు

ఏటూరునాగారం: మండలంలోని ఆర్ఐటీఐలో వివిధ కోర్సుల్లో మిగిలిన సీట్లకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈనెల 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఆగస్టు 1 వరకు 14 వయస్సు ఉన్న, పైబడిన అడ్మిషన్ పొందాలన్నారు. 20 నుంచి 23వ తేదీల్లో ఉదయం 11 గంటలకు స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుంది.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- వైద్యాధికారి సుమలత
- గ్రామాల్లో వైద్యశిబిరాల ఏర్పాటు



మంగపేట : వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారిణి స్వప్న

ఏటూరునాగారం: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి సుమలత అన్నారు. మండలంలోని రొయ్యూరు పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలోని 56 మందిని పరీక్షించి మందులను పంపిణీ చేశామన్నారు. 12 మంది రోగులకు రక్తపరీక్షలు నిర్వహించామన్నారు. ప్రజలు దోమతెరలు వాడాలన్నారు. శిబిరంలో సులోచన పాల్గొన్నారు.

రామన్నగూడెంలో

జ్వరాలను నిర్లక్ష్యం చేయవద్దని రొయ్యూర్ వెల్‌నెస్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి సుచరిత అన్నారు. మండలంలోని రామన్నగూడెంలో వైద్యశిబిరం నిర్వహించారు. 53 మందిని పరీక్షించి మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. జైలుబాబు పాల్గొన్నారు.

ఓడవాడలో..

మండల కేంద్రంలోని ఓడవాడలో వైద్యురాలు చాముండేశ్వరి శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. 60 మందికి పరీక్షలు నిర్వహించగా మందులు పంపిణీ చేశామన్నారు. 12 మంది రక్తనమూనాలను సేకరించి పరీక్షలు చేశామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అరుణ, ఏఎన్ఎం సుజాత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగపేట: మండలంలోని నర్సింహాసాగర్‌లో ఆర్‌బీఎస్‌కే టీం వైద్యాధికారిణి స్వప్న ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. వైద్యశిబిరంలో 75 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ శైలజ, ఏఎన్ఎం సారమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అకినేపల్లిమల్లారంలో..

మండలంలోని అకినేపల్లిమల్లారంలో బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. అనంతరం వైద్య శిబిరంలో 62 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఏడుగురు జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

వాజేడు: మండల పరిధిలోని ఇప్పగూడెంలో కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ ఉర్సు రాజు, స్థానిక వైద్యాధికారి మధుకర్ పాల్గొని రోగులను పరీక్షించి మందులను ఇచ్చారు. అనంతరం ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. 100 మందికి మెడికల్ కిట్లను గుమ్మడిదొడ్డి సర్పంచ్ జయలక్ష్మి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగేంద్ర కుమారి, శేఖర్, కామేష్, హనుమంతు, స్వరూప, రమాదేవి భాస్కర్, ప్రసాద్, ఉష, ఇందిర, ప్రశాంత్, సుజల ఉన్నారు.

ఎస్ఎస్ తాడ్వాయి : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక వైద్యాధికారి రణధీర్ అన్నారు. మండలంలోని మేడారం, గంగారం ఫ్రైడే- డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలందించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రణధీర్ మాట్లాడుతూ వర్షాకాలం నీటిని ఎక్కువ నిల్వ ఉంచితే దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కొడిశాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ పవన్‌కుమార్ పీహెచ్‌సీ పరిధిలోని ఎల్బాక, పడిగాపూర్ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, సూపర్‌వైజర్ సరస్వతి, ఏఎన్ఎం మంగ, గంగ, తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం : పరీక్షలు చేస్తున్న సుమలత



వాజేడు: మెడికల్ కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మంగపేట: గర్భిణులు, తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ విజయలక్ష్మి



ఏటూరునాగారం: మాసోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ కృష్ణ, తదితరులు

మంగపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లీ బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ మల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ తెల్లం విజయలక్ష్మి అన్నారు. పోషకాహార మాసోత్సవాలను పురస్కరించుకుని మల్లూరు సెక్టార్ పరిధిలోని చుంచుపల్లిలో పోషక మాసోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, గర్భిణీలు, బాలింతలతో పోషకాహారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందించే కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెచ్ఎం గొప్ప సమ్మారావు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సర్పంచ్ దొడ్డ కృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ మాసోత్సవాల ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని తీసుకోవాలని, అలాగే ఇంటి వద్ద పరిశుభ్రమైన తాగునీరు, వేడి ఆహారం తీసుకోవాలన్నారు. రక్తహీనత సమస్యలుంటే వెంటనే అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బందికి తెలుపాలని అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అఫ్రీన్, అంగన్‌వాడీ టీచర్ స్వరూపరాణి, రాందెని రమణమ్మ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



చీపురుతో ఊడుస్తున్న డీడీ పోచం, ఉపాధ్యాయులు

ఏటూరునాగారం: విద్యాసంస్థలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, హెచ్‌డబ్ల్యూలు భాగస్వాములు కావాలని ఐటీడీఏ డీడీ పోచం అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నబోయినపల్లిలో వార్డెన్లు, కుక్, కామాటి, డిప్యూటీ వార్డెన్లతో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలోని చెత్తాచెదారాన్ని ట్రైనింగ్ వచ్చిన ఉపాధ్యాయులతో కలిసి తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్రైడేను డ్రైడేగా పాటించాలన్నారు. తల్లిదండ్రులకు వారి పిల్లల ఆరోగ్య పరిస్థితి సమాచారం ఇస్తుండాలన్నారు. ఉపాధ్యాయులు బోధన విషయంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి సాన పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏటీడీఓ దేశీరాం, పీజీహెచ్ఎం సారంగపాణి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలో హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ డీడీని సస్పెండ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

ఏటూరునాగారం: ఉపాధ్యాయుడిని నియమించాలని అడిగినందుకు సర్పంచ్‌పై కేసు బనాయించాలని చూస్తున్న ఐటీడీఏ డీడీ పోచంను వెంటనే సస్పెండ్ చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గావిడి నాగబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దబ్బగట్ల శ్రీకాంత్ అధ్యక్షతన ముఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గావిడి నాగబాబు హాజరై మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన బర్లగూడెం గ్రామపంచాయతీలోని చిరుతపల్లి పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని ఆరు నెలలుగా ఐటీడీఏ పీఓకు వినతిపత్రాలు ఇస్తున్నామన్నారు. అయితే గిరిజన దర్బార్‌లో తమ గ్రామ పంచాయతీలోని చిరుతపల్లి విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామపంచాయతీ సర్పంచ్ కోర్సం నర్సింహమూర్తితో కలిసి సమస్యను పరిష్కరించాలని అడిగినందుకు సర్పంచ్ నర్సింహమూర్తిపై ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం చేయడం సమంజసం కాదన్నారు. ఇలాంటి అధికారి ప్రజలకు విద్యార్థులకు ఏం న్యాయం చేస్తాడని మండిపడ్డారు. తక్షణమే కలెక్టర్ డీడీని సస్పెండ్ చేయడంతోపాటు నర్సింహమూర్తి అడిగిన ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన నాయకులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



విచారణ జరుపుతున్న ఎంపీడీఓ సుదర్శన్

మంగపేట: మండలంలోని తిమ్మంపేటలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సీనియర్ మేట్‌గా పనిచేస్తున్న గోమాసు లక్ష్మినారాయణ కూలీల పేమెంట్ విషయంలో అవినీతికి పాల్పడ్డాడని కొందరు గ్రామస్తులు ఈనెల 4న ప్రజావాణిలో చేసిన ఫిర్యాదు మేరకు ఎంపీడీఓ ఆలేటి సుదర్శన్ శుక్రవారం జీపీ కార్యాలయంలో విచారణ జరిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మేరుగు రాణి అనే మహిళ తాను నాలుగు వారాలు పనిచేయగా ఒక్క రూపాయి కూడా రాలేదని వాపోయింది. 2022 మే నెలలో తిమ్మచెరువులో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు చేయి వేలు కోల్పోయానని, అయినా ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం రాలేదన్నారు. అదే విధంగా సుమారు 30 మంది వరకు తాము 4 వారాలు పనిచేస్తే 2 వారాల డబ్బులు రాలేదని ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. అసలు ఉపాధి పనులకు రాకుండా ఊరిలో లేనివారు, ఇతర ప్రాంతాలకు ఉపాధికోసం పోయినవారు, విద్యార్థులు పనిచేసినట్లుగా సీనియర్ మేటు లక్ష్మినారాయణ మస్టర్లు వేసి తమకు రావాల్సిసిన డబ్బులు రాకుండా చేశాడని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పనిచేసినా డబ్బులు చెల్లించకుండా సుమారు 60 మంది పనికిరాని వారి అకౌంట్లలో డబ్బులు ఎలా పడ్డాయో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. కొందరు మృతి చెందిన వారి అకౌంట్లలో డబ్బుల పడినట్లు వెలుగులోకి వచ్చింది. విషయంపై లక్ష్మినారాయణ మాట్లాడుతూ పనులు చేసే క్రమంలో కొందరు జాబ్ కార్డులు ఉన్నవారు పనులకు రాకుండా వారి కుటుంబ సభ్యులు, బంధువులు పనులు చేశారని, దీంతో వారి అకౌంట్లలో డబ్బులు పడ్డాయన్నారు. డబ్బులు పడిన తరువాత కొందరు మృతి చెందారని, ఈజీఎస్ కార్యాలయంలో సాంకేతిక లోపంతో కొందరి అకౌంట్లలో డబ్బులు పడలేదని దానికి తాను బాధ్యుడిని కాదని వివరణ ఇచ్చాడు. ఈ విచారణలో వచ్చిన ఆరోపణలపై కూలీలకు సంబంధించిన పూర్తి రికార్డులను పరిశీలించి తదుపరి చర్యలకు కలెక్టర్‌కు నివేదిక అందచేయనున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవిప్రియ, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్, శిరీష, సుమారు 100 మంది కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం, రొయ్యూర్, తదితర గ్రామాల్లో ఫాగింగ్‌ను గ్రామ పంచాయతీ సిబ్బంది శుక్రవారం నిర్వహించారు. అలాగే తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్, బ్లీచింగ్ చల్లించే పనులు చేపట్టారు. అయితే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు విజృంభిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సహాయక చర్యలు మరింత ముమ్మరంగా చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. పారిశుద్ధ్య పనులు వేగంగా చేపట్టాలన్నారు.

ఏబీహెచ్‌ఏ అకౌంట్లు తెరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనర్

ములుగు: జిల్లాలో ఐదు సంవత్సరాల పైబడిన వారందరికీ ఆయుష్మాన్ భవ హెల్త్ అకౌంట్ (ఏబీహెచ్ఏ) తెరిపించాలని ట్రైనర్లు యాకమ్మ, గౌరీ, లక్ష్మీ సూచించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య ఆదేశాల మేరకు శుక్రవారం ఆశ కార్యకర్తలకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ-కేవైసీ లింకు ద్వారా ప్రధాన మంత్రి జన ఆరోగ్య యువజనతో ఐడీ క్రియేట్ చేసి ప్రతి ఇంటికి సమగ్రమైన ఆరోగ్య సేవలు అందేలా చూడాలన్నారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు మొదటి శనివారం ఎన్‌సీడీ, అసంక్రమిత వ్యాధులు బీపీ, షుగర్, కేన్సర్, పాలియేటీవ్ కేర్, వృద్ధుల సంరక్షణ, సికిల్ సెల్‌పై రెండో శనివారం క్షయ, కుష్టు, కీటకజనిత వ్యాధులు, మూడో శనివారం మాతాశిశు సంరణక్షణ, పోషకాహార లోపాలు, నాలుగో శనివారం కళ్లు, నోటికి సంబంధించిన, అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ అసంక్రమిత వ్యాధుల వైద్యులు వెంకటేశ్వర్‌రావు, సైక్రియాట్రిస్ట్ డాక్టర్ అమృత, డీపీహెచ్ఎన్ఓ శకుంతల, డెమో తిరుపతయ్య, పీహెచ్ఓ దుర్గారావు, సంపత్‌రావు, పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



వాజేడు : కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మండలంలో అభివృద్ధి పనులకు సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేయటంతో శుక్రవారం ఆయన చిత్రపటానికి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గంపా రాంబాబు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. మండల అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు కృషి చేసిన ఖమ్మం మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాయం రమణ, మండల కార్యదర్శి మురళి, అధికార ప్రతినిధి దామోదర్, సర్పంచ్‌లు అట్టం సత్యవతి, సత్యవతి, సమ్మయ్య, పూనెం శ్రీదేవి, నాయకులు బాలసాని వేణు, వేల్పూరి లక్ష్మినారాయణ, బాలసాని మధు, జాగర శాంతమూర్తియాదవ్, తోట శ్రీను, తదితరులు ఉన్నారు.

వాజేడు: మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మి నారాయణ కోరిక మేరకు మండలానికి రూ 1.50 కోట్ల నిధులను అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు. దీంతో ముఖ్యమంత్రి చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. బాలసానిని అభినందించారు. కార్యక్రమంలో చెన్నం ఎల్లయ్య, గొంది రమణారావు, చంద్రశేఖర్, శంకర్‌దయాళ్, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, మీనయ్య, శ్రీను, సత్యనారాయణ, మల్లికార్జున్‌రావు, నిరీక్షణ, శారద, సరబాబు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

చేయూత



ములుగు రూరల్ : మండలంలోని పత్తిపల్లికి చెందిన పాడుగుల నర్సయ్య, జీవింతరావుపల్లికి చెందిన ఆవునూరు లక్ష్మీనర్సమ్మ ఇటీవల మృతి చెందారు. ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలను శుక్రవారం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్ పరామర్శించి చేయూతనందించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, సర్పంచ్ రత్నం భద్రయ్య, ఎంపీటీసీ మావురపు తిరుపతిరెడ్డి, కోటి, రఘు, తిరుపతి, రవి, రాజేందర్ ఉన్నారు.

వాహన తనిఖీలు




వెంకటాపురం(కె): మండల పరిధిలోని సూరవీడు పంచాయతీ కొత్తపల్లి క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి వచ్చి వెళ్లే వాహనాలను తనిఖీలు చేశారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే వారి వద్ద నుంచి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



ములుగు రూరల్: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 28 వేలు అందించడంతో పాటు ఉద్యోగ విరమణ అనంతరం టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ. 5 లక్షలు ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేపట్టారు. శుక్రవారం ఐదోరోజు సమ్మెలో భాగంగా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు పద్మరాణి మాట్లాడుతూ అంగన్‌వాడీల హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. సీఐటీయూ నాయకులు రత్నం రాజేందర్, మోక్షారాణి, రేణుక, భాగ్యలక్ష్మి, విజయ, అనసూయ, కల్పన, రాధిక, మానస, పాల్గొన్నారు.




వెంకటాపురం(కె): అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం ఐదో రోజు ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని ఊరట్టం గ్రామంలోని వరద బాధితులకు భువనగిరికి చెందిన సమ్మక్క సారలమ్మ వెంచర్ మేనేజింగ్ డైరెక్టర్ సబితారెడ్డి శుక్రవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. జూలై చివరి వారంలో భారీ వర్షాలు, వరదలకు ఊరట్టం జంపన్నవాగు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయారన్న విషయాన్ని ఎమ్మెల్యే సీతక్క వారికి వివరించి వరద బాధితులకు ఆదుకోవాలని సూచన మేరకు 105 మంది బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాల కిట్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ గ్రామంలో రామాలయ గుడి నిర్మాణానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

గౌడ గర్జన సభను విజయవంతం చేయాలి



ములుగు రూరల్: ఈ నెల 22న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న గౌడ గర్జన సభను కల్లు గీత కార్మికులు విజయవంతం చేయాలని బండారుపల్లి సొసైటీ అధ్యక్షుడు చంద్రగిరి కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అశోక్‌గౌడ్, రాజు, సంతోష్, నాగరాజు పాల్గొన్నారు.

తొండ్యాలలక్ష్మీపురాన్ని జీపీగా ప్రకటించాలి

మంగపేట: మండలంలోని కొత్తూరు మొట్లగూడెం పంచాయతీ పరిధిలోని తొండ్యాలలక్ష్మీపురాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా ప్రకటించాలని తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూతవేటు దూరంలో పక్కనే ఉన్న కోమటిపల్లి జీపీ నుంచి తమ గ్రామాన్ని విడదీసి 8 కిటీమీటర్ల దూరంలోని అటవీ మారుమూల ప్రాంతమైన కొత్తూరు మొట్లగూడెం పంచాయతీలో కలుపడంతో గ్రామంలో సమస్యలు పరిష్కారం కాక పోగా నిధుల కొరత కారణంగా అభివృద్ధి నోచుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయన్నారు. కనీసం గ్రామానికి 108 అంబులెన్సు రాలేనటువంటి దుర్భర పరిస్థితి నెలకొందన్నారు. గ్రామంలో అంతర్గత రోడ్లని బురదమయంగా మారాయన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం, ఐటీడీఏ పీఓ వెంటనే స్పందించి తెగిపోయిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలన్నారు.